కథ

# మట్టితాళ్ళ వల

**శిరంశెట్టి కాంతారావు**

మిట్ట మధ్యాహ్నపు ఎండ తేజారకం ఎండు మిర్చీకారంలా మిడిసిపడుతుంది. మూడువందల ముప్పై మీటర్ల వెడల్పున, పన్నెండు మీటర్ల ఎత్తున మానేరు, సంద్ర వాగులమీద, కొత్తగా పోస్తున్న ఎర్రటి మట్టితో తోలు వొలిచిన అనకొండలా గుర్రంవారి పల్లెను మింగడానికి ఉరికొస్తున్నట్టుగా భయంకరంగా కన్పిస్తుంది. మధ్య మానేరు ఆనకట్ట.

ఆనకట్టకు ఎడమ పక్క దూరంగా ఉన్న నల్లని కొండలను 'కర-కరా' నమిలి మింగుతున్న కంకర మిల్లుల చప్పుడు మాటులో పడిన ఎలుగుబంటు రోదనలా విన్పిస్తుంది.

ఆనకట్టకు లోతట్టున ఉన్న సర్కార్ తుమ్మ చెట్లమీద వాలిన గద్దల గుంపు ఏదో చచ్చిన గొడ్డును పీక్కుతింటూ... మధ్య, మధ్యలో "క్రీల్, క్రీల్" మని అరుస్తూ ఆకాశంలో చక్కర్లు కొట్టొస్తున్నాయి.

కనుచూపు అనినంత దూరం చెలకలనిండా ఆనకట్టకోసం తవ్విన ప్రొక్లైనర్ గుంటలు మృత్యు బిలాల్లా కన్పిస్తున్నాయి.

ఇక ఆనకట్టకు కుడిపక్కన మిగతా ప్రపంచాన్నుండి ఊరును వేరుచేస్తున్న ముళ్ళకంచెలా సాగిపోతున్న కాలువకట్ట ఎండకు మెరుస్తూ... కన్పిస్తుంది.

ఆఁ కాలువకు, ఆనకట్టకూ మధ్య భూమితల్లి వంటిమీద అలంకరించిన పచ్చల పతకాల్లా అక్కడక్కడా బావులకింద వేసిన వరిపొలాలు, మొక్కజొన్న తోటలూ గాలికి ఊగుతూ కనబడుతున్నాయి.

ఆనకట్ట మీదుగా పచ్చి ఈతాకుల మోపులు నెత్తిన మోసుకుంటూ ఊరుదిక్కు నడుస్తున్నారు ఎరకలి పొట్టన్న, రాజవ్వ దంపతులు.

"జుయ్యి"మని వీస్తున్న బోదగాలికి వాళ్ళ తలల మీది ఈత కమ్మలు పసిరిక పాముల్లా అల్లల్లాడుతూ వెనక్కి తోస్తుంటే, అసలే వంగిపోయిన వాళ్ళ నడుములు మరింత వంగిపోతుంటే అడుగుతీసి, అడుగు వెయ్యడానికి ఎంతో కష్టపడుతున్నారు.

గాలి విసురుకు మెడనరాలు 'గరెల్లు' మంటుంటే నెత్తిమీది మోపులను అట్లాగే ఒడిసిపట్టుకుంటూ "నాయినా! ఎవుడాల రాజన్నా! యాల్ల పొద్గాల కొంచబోక ఇంకెందుకుంచుతున్నవే? పడ్డ కస్టాలు సాలవా?" భర్త వెనుకెనుకే నడుస్తున్న రాజవ్వ ఊపిరి తీసుకుంటూ మెల్లగా అన్నది.

''అట్టంటెట్ట? ఆకు నినిగిందాక నొస్టనరాసినయన్ని అనుగబించాలగా...'' భార్య మాటలకు బదులుగా గొంతు విప్పాడు పొట్టన్న.

పొట్టన్నకు అరవై ఎనిమిదేండ్లు. నల్లగ ఇంతెత్తున ఉంటాడు. మొలకు పంచ తప్పవంటిమీద ఇంకో బట్ట ఏదీ వేసుకోడు. కాళ్ళ తొడుక్కున్న కొత్త టైరు చెప్పులను 'బర్రు, బర్రు' మని నేలకు ఈడుస్తూ నడుస్తున్నాడు. మీ గాళ్ళకు పట్టెల్ళు వొరుసుకు పోగుండా వాటికి పాత గుడ్డలు చుట్టుకున్నాడు.

వయసు మీద పడడం వల్లనో, మొదటి నుండీ కష్టం చేయడం వల్లనో గాని పొట్టన్న వంట్లో కండలన్నీ కరిగిపోయి ఎక్కడికక్కడ తోలు ముడతలు పడి వేళ్ళాడుతుంది. తను అడుగు వేస్తున్నప్పుడల్లా ఎదమీద రొమ్ములు రెండూ తోలుబద్దల్లా పైకీ, కిందికీ కదులుతున్నాయి. పొగాకు నములుతున్న దవడలను అదేపనిగా ఆడిస్తూ మధ్య, మధ్య 'తుసుక్కు, తుసుక్కు'మని ఉంచుతున్నాడు.

అతని ఎడమ భుజానికి జోలె ఒకటి వెళ్ళాడుతుంది. ఆఁ జోలెలో నాలుగైదు ఉడతలు, రెండు మూడు ఎంటవలు, ఐదారు పూరేడు పిట్టలూ చచ్చిపడి కన్పిస్తున్నాయి.

ఇక రాజవ్వ విషయానికొస్తే... తను భర్తకన్నా ఎనిమిదేండ్లు చిన్నది. ఎర్రగా ఎర్రతేలు మాదిరిగా ఉంటుంది. ఆమె కట్టుకున్న పాసిరంగు నేత చీర పల్చబారిపోయింది. ఎదమీద పైట చెంగును తీసి నడుము చుట్టూ తిప్పి గట్టిగా నడికట్టుకట్టుకుంది. ఆమె తొడుక్కున్న కృష్ణబులుగు రంగుగుండీ రైకఉప్పదేలి పొదలు, పొదలుగా కన్పిస్తుంది. పైటలేని ఆమె ఛాతి, ఎండిపోయి మగవాడి ఛాతిలా కనబడుతుంది.

ఏమాత్రం తెల్లబడని జుట్టును ముచ్చడ గుంతకు కుడిపక్కన లోముడి వేసుకుంది.

ముంజేతులకు ఎర్రటి మట్టిగాజులు, వాటికి ఆఁచివర, ఈఁ చివర వెండి మురుగులు వేసుకుంది.

కాళ్ళకు పెట్టుకున్న కడియాలు వొరుసుకుపోయి నల్లటి కాయలు కాసి అదోరకంగా ఉన్నాయి.

ఆమె తొడుక్కున్న వెండి మెట్టెలు అడుగుతీసి, అడుగువేస్తున్నప్పుడల్లా మెత్తటి సవ్వడి వినిపిస్తూ చెవులకు హాయిగా అన్పిస్తుంది.

ఆమె ఎర్రటి ఎడమ దండ చేతిమీద, గడ్డంమీద పచ్చబొట్లు కన్పిస్తున్నాయి. ఆమె కుడి చంకన ఖాళీ అయిపోయిన సొరకాయ నీళ్ళ బుర్ర వేళ్ళాడుతుంది.

వాళ్ళిద్దరికీ కొంచెం ముందుగా కొలిమితిత్తుల్లా ఎగిసిపడుతున్న డొక్కలతో, ఇంత పొడవున నాలుకలు వెళ్ళబెట్టి 'గస, గస' మని వగిరిస్తూ. చెవులు కోసిన కుక్కలు రెండు ఉరికినట్టు నడుస్తున్నాయి.

నడుస్తున్న రాజవ్వే మళ్ళీ నోరుతెరిచి "ఉన్న రొండెకరాల రేగడి డాం లబాయె. వొచ్చిన పైసలు బూసని బొందగ్గొట్టుకొని. ఇయ్యాల్నో, రేపో ఉన్న ఇల్లును సుత ఈకట్ట మింగేస్తది. యాడికి బోవాల్నో తెల్వక పాయె. అదిపాయె ఎటన్న బోదామన్నా ఇంతవరదాకా ఇండ్లకు పైసలు రాకపాయె. ఈఁ పాడుబడ్డ డాం యాడికెల్లొచ్చెనో?

సూస్తుండంగ ఇల్లు వల్లకాడై పాయె" కడుపులో మసులుతున్న వేదనంతా వెళ్ళి గక్కడం మొదలు పెట్టింది.

✣ ✣ ✣

పొట్టన్న, రాజవ్వలది ఇల్లంతకుంట మండలం గుర్రంవారిపల్లె. మధ్య మానేరు ఆనకట్ట కింద మునిగిపోయె ఊళ్ళల్లో అదీ ఒకటి. ఆఁ ఊళ్ళో మొత్తంగలిపి నూటాయాభై గడపుంది. వాటిల్లో ఎక్కువభాగం రెడ్లు, యాదవులవి కాగా, మిగతావి కులానికో రెండు, మూడు ఉన్నాయి.

పొట్టన్న, రాజవ్వలది ఊళ్ళో ఒకే ఒక ఎరుకలిల్లు. అదికూడా ఊరికి ఉత్తరం పక్క కొంచెం ఎడంగా, వేపలతోపుకు దగ్గరగా ఉంటుంది.

పొట్టన్న దంపతులకు ఇద్దరూ కొడుకులే. ఇద్దరికీ పెండ్లిల్లయ్యాయి. పెద్ద కొడుకు నల్లన్న, కోడలు చిలకవ్వ. వాళ్ళకు పదిహేనేండ్ల కూతురు పూలవ్వ, సిరిసిల్ల హాస్టల్లో ఉండి ఏడో తరగతి చదువుతున్న కొడుకువరన్న ఉన్నారు.

పొట్టన్న చిన్నకొడుకు బూసన్న, కోడలు నాగవ్వ. వాళ్ళకు సంతానం లేదు.

పొట్టన్న వాళ్ళకు రేగులదిబ్బ దిక్కు రెండెకరాల రేగడి చెలక. ఊళ్ళో, మూడు దూలాల పూరిల్లు, పదిహేనూ, ఇరవై పందులు, వాటికో ప్రత్యేకమైన గుడిశ, దానిముందు వాటి కుడితి కోసం రాతిగోలెం ఉన్నాయి.

పెద్ద కొడుకు, కోడలు అడివికి పోయి ఈతాకు కోసుకురావడం, తల్లిదండ్రులు బిడ్డ కలిసి అల్లిన చాపల్ని, గంపల్ని, పేడతట్టల్ని, చీపురు కట్టల్నీ తీసుకుపోయి ఆఁ చుట్టువక్క గ్రామాల్లో అమ్ముకురావడం చేస్తుంటారు.

ఇక చిన్న కొడుకు, కోడలు పొద్దున్నే లేసి పందుల్ని అడివికి తోలుకుపోవడం, చెలకలో ఏదన్న పనుంటే చూసుకోవడం చేస్తుంటారు.

ఏ రోజన్నా నీసు తినాలనుకున్నరోజున తండ్రీ కొడుకులు వలను తీసుకుని, కుక్కల్ని వెంట బెట్టుకుని పెద్ద గుట్టల మీదికి వేటకు పొయ్యి కుందేళ్ళనో, ఉడతల్నో, కౌంజుల్నో కొట్టి కొట్టి తింటారు, తాగుతారు.

ఊళ్ళో ఒకరి జోలి, జోక్యం లేకుండా తేటగా బతుకుతున్న పొట్టన్న కుటుంబం మీద మధ్య మానేరు ఆనకట్ట పిడుగుపాటులా వచ్చిపడింది.

మట్టి తాళ్ళ వలలో చిక్కిన గుర్రంవారిపల్లె బతుకు తప్పించుకునే దారిలేక విలవిలలాడ సాగింది.

ఆఁ ఆనకట్ట కింద అటు చీర్లవంచ, చింతల్ ఠాణా, రుద్రవరం దగ్గర్నుండి ఇటు కొదురుపాక, నీలోజుపల్లి, షాబాజుపల్లి వరకు దాదాపు పద్దెంది, ఇరవై ఊర్లు మునిగిపోతున్నాయి. అరవై డెబ్బై వేల మంది నిరాశ్రయులవుతున్నారు. వేల ఎకరాల పంట భూములు, అనేక వందల ఇండ్లు, రోడ్లు, గుళ్ళు, బళ్ళు నీటిపాలవుతున్నాయి.

"ఇందాకటి సంది నానకిన్న నేనీ వొర్లుతుంటే, మన్నుదిన్న పాములెక్క ఊఁ అనవే, ఆఁ అనవే!?" తన ముచ్చటకు పెనిమిటి నుండి స్పందన రాకపోవడంతో నిష్టూరపోతూ దీర్ఘం దీసింది రాజవ్వ.

జరసైన్తవా? ఏదేదో మదిలబడి పొదైతుంది. లచ్చుందేవంటి కోడలట్లబాయె, మనవడి ట్ల బాయె, సేతులు గాలిన నల్లన్న తేరుకోకపాయె, ఈడేరి ఇంట్లున్న మన్మరాలు లగ్గం గాకపాయె, ఫైనల్ దీనుకోని దెంకపోయిన బూసిగాడు, నాగవ్వ జాడలేకపోయిరి. గీఁ ఈడున మనం అడివి మీనబడి సెట్టు, సెట్టు తిర్గాల్సొచ్చె' అగో గాఁ ఎతలన్ని మతిలబడి మాట ఎల్లలేదు సర్నా?" రాజవ్వకు సంజాయిషీ ఇస్తున్నట్టుగా మాట్లాడిన పొట్టన్న కళ్ళ ముందు గీతం నీలి నీడలు కదలాడసాగాయి...

✣ ✣ ✣


అగో- గా అనుమాన్ల గుడెన్న కాపోల్ల శంకరెడ్డి ఇల్లుగూడ మనిల్లంతే ఉండె మరి వాల్లకేమో మూడు లచ్చలొస్తయని, మనకేమో ఎనపై ఏలే అస్తయని సర్పంచి ఇంట్ల లోటీను బోర్డుల కాయితాలు అంటుబెట్టిండ్రంట. గిద్దెక్కడి అన్నాల్లం?! అచ్చే పైసలన్నీ జర వొక్కతీర్న అచ్చినా బాగుండు. గూడుసెదిర్న గువ్వల్లెక్క ఇల్లిడ్సి యాడికి బోవాల? ఎట్లుండాల?" ముల్లు గొట్టి అనగేసిన ఈతాకును బండకింది నుండి తీసుకుంటూ... ఆఁ పక్కనే కూర్చుని ఈతమెల్లెలు చీలుస్తున్న భర్త నల్లన్నతో అంది చిలకవ్వ.

"ఏంజేస్తం? అండబట్టి కొండబాక మన్నట్టుగా కాపాయన బామ్మర్ది సిరిసిల్ల తాశీలాపీసుల కొలువు జేస్తడు. ఉన్న ఇంటికి ఎట్లెట్ల వైనం జేస్తే పైసలెక్కువొస్తయో గాయినకెర్క. గౌర్మెంటోల్లు ఇండ్లు రాస్కపోయ్యేటందుకొస్తుండ్రని ముందల్నే ఎరికజేసుకోనొచ్చి ఇంటి సుట్టూతా నాలుగేలు కర్సుబెట్టి రొండొద్దుల్ల పారిగోడ దిప్పిచ్చె. ఇంగే ఉంది" అచ్చి నోల్లుసుత గిదేందని అడక్కుంటనే పారి గోడల్దాంక ఇంటికిందనే రాస్కొని పాయిరి. లచ్చకు ఇరవై ఏలిస్తే అచ్చినోల్లే ముస్తుగ రాస్తుండ్రంట. గాఁ ఇక మతులన్నీ మనకు తెల్వకపాయె" చీల్చిన ఈత సువ్వను వేప చెట్లనీడలో పల్చగా ఆరబెడుతూ ఉన్న విషయం చెప్పుకెచ్చాడు నల్లన్న.

కొడుకు, కోడలు మాట్లాడుకుంటున్న ముచ్చట విన్న రాజవ్వ "దునియమీద నియతి గట్లుంది ఏంజేస్తం?" సాప అల్లడానికి 'పట్టె' మొదలుపెడుతూ నిస్సహాయంగా మాట్లాడింది.

"డాం కింద మున్గుతున్న ఏ ఊల్లచూసినా గిసుమంటికతలే ఇనబడుతున్నై, ఉన్నోల్లు ఏదో రూపంల దోనుకుంటుంటె, మనసుంటోల్లు అన్నాలమైపోతుండ్రు". మొన్న తను పెండతట్టలు, కూరగాయగంపలు అమ్ముకోడానికి నీలోజుపల్లికి పోయినప్పుడు ఆఁ ఊళ్ళో పిల్లా, జెల్లా లేని ముసలి లింగన్నగౌడ్ ఇంటికి పదివేలేవస్తాయని చెప్పి రాసుకుపోయిన ఉద్యోగులు పక్కనే ఉన్న కాపు రాజన్న ఇంటికి కమీషన్ తీసుకుని నాలుగు లక్షలకు రాసుకుపోయిన సంగతిని పసిగట్టిన విలేఖరి ఒకడు విషయాన్ని పేపర్ కెక్కించడంతో ఒక్కసారిగా జిల్లాయంత్రాంగం ఉలిక్కిపడి కళ్ళు తెరిచిన సంగతి కళ్ళముందు కన్పిస్తుంటే అన్నాడు నల్లన్న.

మాటల సందట్లో మెల్లె చీలుస్తున్న నల్లన్న చేతిలోని కత్తి జారి ఎడమచేతి బొటన వేలికి తగలడంతో బొటా, బొటా రక్తం కారుతుంటే లేచి గబ, గబా ఇంటివెనుకకు పరుగెత్తి కంచెలో పెరిగి ఉన్న గాయం ఆకును తెంపుకుని మెత్తగ నలిపి 'కాటు' మీద



**అనకాపల్లి శారదా గ్రంథాలయంలో మహాకవి శ్రీశ్రీ శతజయంతి ప్రారంభ సభను విశాఖజిల్లా ఇండియన్ కల్చరల్ అసోసియేషన్, సాహితీ వేదికలు సంయుక్తంగా నిర్వహించాయి. ఐసిఏ ఛైర్మన్ మాధవీ సనారా సభకు అధ్యక్షత వహించారు. మానేపల్లి శ్రీశ్రీ బులెటిన్‌ను, వెంపలి శివప్రసాద్ నేటి కవిత 2008ను ఆవిష్కరించారు.**

సం పిండుకున్నాడు.

అంతలోనే పాత గుడ్డ తీసుకుని వచ్చిన లకవ్వ గాయం మీద గట్టిగా కట్టు కట్టింది.

రక్తం కారడం ఆగిపోయిన కాస్సేపటికి ళ్ళీ వచ్చి ఈతమెల్లెల ముందు కూర్చోబోతున్న ల్లన్నతో "కొడుకా! ఇంగ నువ్వేం జీలుస్తవ్ గాని త్తిమీఅయ్యకిచ్చి జరసేపు అట్ల గూసోఫో తయారైన ద్దెంది పట్టెల సాపకు అంచులు కుడుతూ అంది జవ్వ.

అంతలో...

అడవికి పందులు తోలుకుపోయిన ూసన్న, నాగవ్వలు పూటుగా తాగి తూలుతూ వచ్చి ందులను గుడిసెలో తోలి తడిక అడ్డం కట్టారు.

వాళ్ళనాస్థితిలో చూసిన రాజవ్వ సాపను క్కన పడేసి ఇంట్లోకెళ్ళి చెరో కంచంలో ఇంత న్నం, గోంగూర తొక్కు వేసుకుని తెచ్చి వాళ్ళ ముందు పెట్టింది.

కంచంలోని గోంగూర తొక్కును చూసిన ూసన్న పాములా బుసకొడుతూ తల్లిమీదికి ంతెత్తున లేచి "నీయవ్వ! ఎర్రపెండన కాలు, కాలు ొట్టుకుంట అడివంత తిరిగొస్తే గీ గొగ్గూర తొక్కేసి వ్వ బెడతావ్? నాత్రి తున్కల కూరంత దెంగి ిన్నారు?" అంటూ చేతిలోని కంచాన్ని పందుల ోలెంలోకి విసిరేసి, నోటికొచ్చినట్టు తిట్టుకుంటూ ంటి ముందు వేపచెట్టు కిందికి చేరాడు.

పెనిమిటితోపాటు తనూ కంచాన్ని ోలెంలో పడేసి మెల్లగా మగని పక్కనచేరి "వతన్ ేసుడు మనొంతు, ముంచిగకూసోని పొంతం ేసుడు అల్లొంతు" అంటూ తోడికోడలు వంక మెటికీలు విరుస్తూ... ఏదేదో నోటికొచ్చినట్టు ిట్టిపొయ్యసాగింది...

చిన్న కోడలి మాటలు విన్న రాజవ్వ సాపను చుట్టి మూలనపెడుతూ "ఏందే పిల్ల! అట్ల మాట్లాడ్తవేంది? తున్కలకూర రాత్రే ఐపాయె! ట్టెడుగున ఇంత అంటు మిగిల్తె సలెన్నంల మీ ూవకేసి పెడ్తి. ఏవోదానికెల్ల కొర్ర కొర్ర ూసుకుంట లావు మాట్లాడ్తన్నవేంది?" పెద్ద కోడలి తప్పేంలేదన్నట్టు తేల్చి చెప్పింది.

అత్త మాటలు విన్న నాగవ్వ పెట్రోలు ల్లి అగ్గిపుల్ల గీసినట్టు 'గప్పు'మని నోరు తెరిచి 'నూనినవా? నేజెవ్వంటే నీకు సెవుమీన పేనుబారినట్టన్న లేకపాయె. మీ అవ్వ, నాయినలకు ద్ద కొడుకు, కోడలంటేనే ఇష్టం. గొడ్డు బోతోల్లమని మన మీద సిన్న సూపు. గందుకనే సర్కారోల్లిచ్చిన ెల్కపైసలు ముడుపు గట్టి ముల్లెకు, ముల్లె అల్ల సీతిలబెట్టింద్రు. రేపు ఇంటి పైసలు సుతగట్లనే జేస్తరు జూడు" అంటూ మగని బుగ్గల మీద తన ఎడమ చేత పొడిచినట్టే పొడుస్తూ... ఏదో సైగ చేసింది.

భార్య సైగ అందుకున్న బూసన్న "నాకో వొంద రూపాలియ్యే! పనుంది". అంటూ తల్లి మీదికురికాడు.

"వీడిల్లు పాడువడనన్ను బత్కనియ్యడుబిడ్డా...." అంటూ పెద్ద కోడలి వంక దీనంగా దూసింది రాజవ్వ.

అత్త చూపును అర్థం చేసుకున్న చిలకవ్వ మారు మాట్లాడకుండా లేచి వెళ్ళి వంద నోటు దెచ్చి అత్త చేతికిస్తుండగానే 'గబుక్కున' ఆమె చేతిలో నోటును గుంజుకుని బైటికి నడిచాడు బూసన్న.

తనూ లేచి భర్త వెంట బైటికి నడుస్తూ... పైసలు బొడ్డు గట్టుకోని తిర్గుతావ్?" అంటూ తోడికోడలి వంక వ్యంగ్యంగా జూస్తూ గబ, గబా భర్తను చేరబోయింది.

"ఆం సెలకపైసలే మంటొచ్చినయో! గప్పటి సంది గిదేకత. పిచ్చిసార తాగెటోల్లు సక్కగ గుడ్డి కమ్మీరోని బడ్డికొట్ల బ్రాండి, బీరు తాగుడు సురుజేసింద్రు. మీదికెల్లి మమ్ముల్ని పండ్లో అని అమ్ముతుంద్రు. గీ ఇంటిపైసలొచ్చిందాక కూసుంటే, అప్పటికల్ల, సెలకపైసలైపోతై. గిదంత ఎందుగ్గాని, ఎవలపైసలాల్లకు పంచియ్యుంద్రి. ఎట్లబొయ్యేటోల్లు అట్లనే బోతరు"... అంటూ వల, వల ఏడ్చుకుంటూ అత్తా, మామలతో మొర పెట్టుకుంది చిలకవ్వ.

అప్పటిదాకా జరిగేదంతా చూస్తూ మౌనంగా కూర్చున్న పొట్టన్న బొడ్లో దోపుకున్న పొగాకు కాడతుంపి నోట్లో పెట్టుకుంటూ..." జర్ర వోసికవట్టుబిడ్డా! గాం అగ్రారం మిట్టమీన ఊరోల్లందరికి ఇండ్లుగట్టిస్తమని సర్కారోల్లు సెబుతుంద్రుగాదు! గదేదో తేలినంక ఏదో ఒకటి సేద్దాం గాని గప్పిటిదాన్క జరవోపికబట్టు" అన్నాడు అప్పటి దాకా కట్టిన ఈతాకు చీపురుకట్టను పక్కనబెడుతూ...

❖ ❖ ❖

గొర్రెల మందను తోలుకుపోతూ కట్టమీద ఎదురైన నక్క మల్లయ్య "అయ్యో పొట్టన్నా! మీకీ ముసలి తనాన లావు దుఃఖమొచ్చెనేమో". అంటూ మందలించేసరికి అప్పటిదాకా ఆలోచనల్లో పడి కొట్టుకుపోతున్న పొట్టన్న బయటకొస్తూ" ఏం జెయ్యమంటవ్ మల్లన్నా! మారాతిట్టుంది. భుజానికున్న జోలెను ఎగేసుకుంటూ అన్నాడు.

"బూసన్న జాడేమన్న దొరికిందానే?" అంటూ నక్క మల్లయ్య ఇంకేదో అడగబోతుండగానే గొర్రెలమంద కట్టదిగి పోతుంటే గమనించి "హ్వాం

## వికృతరూపాలు

యస్.యస్. రెడ్డి

సృష్టిని ధిక్కరిస్తున్న
కీచకులు
పుట్టి ప్రపంచాన్ని
ముంచుతున్న పాతకులు
విచక్షణాజ్ఞానం కోల్పోయిన
చరిత్రహీనులు
కలికాలం సహించని
రాక్షసులు
కామం వికటించిన
కామాంధులు
నీచత్వం ప్రకోపించిన
నికృష్టులు
వారే వావి-వరసా
ఊసెత్తని అక్రమార్కులు
మంచీ-చెడు ముఖమెరుగని
వంచకులు
కన్నకూతుళ్ళతో...
రాక్షస లీలా వినోదులు
విస్తరిస్తున్నారు జాగ్రత్త
వికృతరూపాలు ధరిస్తున్నారు
జాగ్రత్త! జాగ్రత్త!!

... హ్వాం.... ట్రూర్... ట్రూర్..." మని రిచ్చగొట్టుకుంటూ చేతిలోని వంకి కర్రను 'టక, టక'మని నేలకు తాటిస్తూ... పైమీది తువ్వాలను ఎడమ చేత ఎత్తి పట్టి గాల్లోకి ఊపేసరికి కట్ట దిగుతున్న గొర్రెలన్నీ చిత్రంగా మళ్ళీ కట్టమీది కురికొచ్చి దొడ్డికట్టి నిల్చున్నాయి.

"యాడిది మల్లన్నా! పోవుడు గుత్త మల్ల పత్తలేరు..." అప్పటిదాకా మౌనంగా వింటూ నడుస్తున్న రాజవ్వ కల్పించుకుంటూ దుఃఖం నిండిన గొంతుకతో అన్నది.

"ఏం ఇంట్ల జూసినా ఏదోకత గిట్లనే నడుస్తుందే రాజక్కా! మా కిస్టన్న కొడుకులిద్దరూ అచ్చిన చెలకపైసలు చెరి సగం పంచుకోని ఎవని అత్తగారింటికి ఆడు దెంకపోయిండు. వైసున ఇత్తనం పోతోలిగ బతికిన మాకిస్టన్న ముసలమ్మను బెట్టుకోని కంటిక్కడివెడు ఏడ్చుకుంటూ బతుకుతుండు" మధ్య మానేరు ఆనకట్ట పచ్చటి కుటుంబాల్లో రేపుతున్న కల్లోలం కళ్ళ ముందు కదలాడుతుంటే ఒక్కో మాటా కూడదీసుకుంటూ అన్నాడు నక్క మల్లయ్య.

ఇంతలో...

ఆనకట్ట లోపలిపక్క చెలకల్లోకి పందుల్ని తోలుకుపోయిన పొట్టన్న మనుమరాలు పూలవ్వ వాళ్ళను చేరవచ్చి నాయనమ్మ నెత్తిమీది మోపును తాను ఎత్తుకుని, తన చేతిలో పందుల కర్రను నాయనమ్మకు అందించింది.

దొడ్డి చెదరగొట్టి ముందుకు కదలబోతున్న ఓ గొర్రె వీపుమీద వంకి కర్రతో 'దుబుక్'న కొడుతూ పాపం! గీపోరి గతెట్లనో?" అన్నాడు పూలవ్వ ముఖం వంక చూస్తూ నక్క మల్లయ్య.

"మా దుఃఖమంత దీన్ని గురించేనే మల్లన్నా!" తలమీది బరువు దిగిపోవడంతో ఒళ్ళంతా తేలిగ్గా అన్పిస్తుంటే, జువ్వు మంటున్న మెడనరాలను చేతితో రుద్దుకుంటూ అంది రాజవ్వ.

గొర్రెలమంద ఎండకు తట్టుకోలేక అటూ, ఇటూ కదులుతుంటే చూసిన నక్క మల్లయ్య "పొట్టన్నా! మంద నిలబడేటట్టు లేదుగాని ఇంగబొయ్యొస్తనే" అంటూ ముందుక్కదిలాడు.

"సర్లే పొయిరాన్నా! అంటూ తన భుజానికున్న జోలెను రాజవ్వ కందించి మీరు నడువుండ్రి, నేను సిన్నంగొస్తగాని" అంటూ భార్యను మనుమరాలిని పంపించిన పొట్టన్న కళ్ళముందు ఎంత వద్దనుకున్నా గతం బొమ్మకట్టి కదలాడసాగింది.

✤ ✤ ✤

పందుల గుడిశ ముందు వేపచెట్టుకింద 'రక్కసినార' నులక మంచం మీద పడుకున్న చిలకవ్వకెందుకో మధ్యరాత్రి మెలుకువొచ్చి ఇంటివైపు చూసేసరికి తలుపులు బార్లా తెరిచి ఉండడం కనిపించింది. ఐతే, తోటికోడలు కాలు మడుచుకో దానికి ఇంటి వెనక్కి వెళ్ళిందేమోనని చాలాసేపు ఎదురు చూసినా ఏ అలికిడి లేకపోవడంతో ఏదో అనుమానమొచ్చి "తలుపులు గూడా ఎయ్యకుంట మల్ల సారకొట్టుకు బొయ్యిండ్రా ఏంది" అనుకుంటూ లేచి ఇంట్లోకి నడిచింది.

ఇంట్లోకి పోయిన చిలకవ్వ "వావ్వో! కొంప మున్గిందిరో నాయనా!" అంటూ ఒక్కసారిగా ఘొల్లుమంటూ కూలబడింది.

చిలకవ్వ ఏడుపుకు ఉలిక్కిపడి లేచిన ఇంటిల్లిపాదికీ ఏమైందీ అర్థంగాక "ఏందేంది?" అంటూ కంగారు కంగారుగా ఇంట్లోకురికారు.

ఇంట్లో జరిగిందేమిటో అర్థమయ్యేసరికి రాజవ్వ, పూలవ్వలతో సహా ఇంట్లో వాళ్ళంతా ఏడవడం మొదలుపెట్టారు.

చల్లపూట అలగోడు, బాలగోడుగా ఏడుస్తున్న ఏడుపు సవ్వడి ఊరంతా విన్పించడంతో ఆ వాడకట్టు వాళ్ళంతా కట్టున కదిలొచ్చారు.

ఆ తరువాత మరో ఫావుగంటకల్లా ఊళ్ళో ఏ ఇంట్లో చూసినా ఎరకల పొట్టన్న చిన్న కొడుకు, కోడలు చెలక పైసలు ముల్లెకు ముల్లె ఏసుకోని ఎటో దెంకపోయిండ్రంట" అన్న వార్త పాకిపోయింది.

అసలే ఊరి సర్పంచ్, అధికారులు కుమ్మక్కై 'ఏ' గ్రేడ్ కింద రావాల్సిన రేగడి భూమికి 'సి' గ్రేడ్ 'దుబ్బ' చెలక డబ్బులిచ్చి మోసం చేశారని మొత్తుకుంటున్న పొట్టన్న కుటుంబాన్ని మరింత మోసం జేస్తూ.. బూసన్న దంపతులు డబ్బులెత్తుకుని పారిపోవడంతో ఏం చేయాలో తోచక ఇంటిల్లాజులు పెద్ద పక్షుల్లా రోధించసాగారు...

తెల్లవారి పదిగంటలవుతుంది.

అప్పటిదాకా ఇంటి ముందు పాసిగొట్టలేదు. సానిపి చల్లలేదు.

ఇంట్లో ఎవ్వరూ ముఖాలు కూడా కడగలేదు.

ఐతే, రోజూ ముసి, ముసి చీకటితోనే గూడు ఎల్లదీసి అడవికి తోలుకుపోయో" పందులకు ఆ రోజు ఎండెక్కడంతో అవికాస్తా గిస్... గిస్... మని గీసుపెడుతూ... ఒకదానొక్కటి కరుచుకుంటూ ఇల్లంతా మోత మోగించసాగాయి...

దాంతో ఎటూ పాలుబోని చిలకవ్వ రెండురోజులు హాస్టల్‌కి సెలవులని ఇంటికొచ్చిన కొడుకు వంక చూస్తూ" కొడుకా! జరసేపా పందుల్ని దారిలోపల చెలకల్లో తిప్పకరాపో..." అంటూ బ్రతిమాలింది.

"హ్వా! నీయవ్వ రేపు మాకు పరిచ్చుంది. హాస్టల్ బొవ్వాల" అంటూ వాడు మొరాయించాడు.

వాడు ఎంత మొత్తుకున్నా "ఈ ఒక్కపూటకు పోయిరా" అంటూ బుదరకిచ్చి కంచంలో ఇంత చద్దిబువ్వ పెట్టుకొచ్చి వాడి చేతికందించింది చిలకవ్వ.

దాంతో వాడు అన్నంకూడా తినకుండానే ఏడ్చుకుంటూ పందులగూడు తడిక తీశాడు.

✤ ✤ ✤

పొద్దు పడమటికి తిరిగిపోతుంది.

పక్షులు, పశువులు చెలకలు విడిచి మెల్లగా వెనుదిరుగుతున్నాయి.

పందులను తోలుకుపోయిన చిలకవ్వ కొడుకు మాత్రం జాడలేడు.

వాడికోసమే ఇంట్లోకీ, బైటికీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న చిలకవ్వ. పోరడు పొద్దు ననంగ వరిగడువున వందుల్నిడ్సకపాయె. పొద్దు సాల్తింవొరిగిపోతున్నా జాడలేకపాయె. దెంకపోయి నోల్లను దెవులాడుకొస్తమని అయ్యా! కొడుకులు చెరోదిక్కు బాయిరి. ఇప్పుడేంజెయ్యాల?" అంటూ అత్తతో చెప్పుకుని ఆందోళన పడసాగింది.

"నేనా గుర్రాలోల్లకుంట దాన్కనన్న బొయ్యొస్తగాని నువ్ సేరు బియ్యం గడిగిపొయ్యి మీనబెట్టు" కోడలి మాటలకు బదులిచ్చిన రాజవ్వ చెప్పుల్లో కాళ్ళు పెడుతుండగానే దూరంగా ఎవరో 'హాంచ్' మంటూ ఆర్చి తుమ్మారు.

"వాడి ముక్కుల్లో నా చెప్పు, మొకం మీ్మదనే ఆర్సి తుమ్మె?" అనుకుంటూ చెప్పుల్లో కాళ్ళు బయటకు తీసి, పక్కనే ఉన్న మంచినీళ్ళ కుండలో నీళ్ళు ముంచుకుని పుక్కిలించుతుంటే... గున, గున మని ఉరికొచ్చిన పందులు గిస, గిస తోకలూపుకుంటూ కుడితిగోలెం మీదికి ఎగబడ్డాయి.

పందులను చూడగానే గుండె నిమ్మలమైన చిలకవ్వ కొడుకు కోసం ఎంత దూరం పారి జూసినా వాడు మాత్రం కనిపించకపోవడంతో "పందులచ్చినై గాని కొడుకాడబాయె?" బియ్యం చాటను పక్కన బెడుతూ గుబులు, గుబులుగా అంది.

తల్లి అవస్థ గమనించిన పూలవ్వ "అవ్వా! ఏం పరేశానైతవుండు. మేం ఆడిదాన్క బొయ్యొస్తంగాని" అంటూ నాయనమ్మ చెయ్యిపట్టుకుని తలవాకిలి దాటుతుండగానే కుమ్మరి ఐలయ్య బిర్రా, బిరా వాళ్ళకెదురుకొచ్చి "రాజవ్వా! మీ కొంప మునిగిందే అవ్వా!" అంటూ ఆమెను పట్టుకుని ఏడవసాగాడు...

ఒక్కసారిగా బీరిపోయిన రాజవ్వ" ఏందే

సిన్నాయనా! ఏమైందే?" అంటూనే రెండు చేతులతో ఎదురొమ్ము మీద బాదుకుంటూ తనూ పెద్దగా ఏడవసాగింది...

మీ మనవడా 'డాం' కోసం తొవ్విన పొక్కలబడి సచ్చిండే అవ్వా! "సారెమన్ను కోసం గుర్రాలకుంటకు పోయి వస్తూ తాను చూసిన విషయాన్ని వివరించాడు ఐలయ్య.

వెలుగుతున్న దీపం బుగ్గమీద నీళ్ళచుక్క పడితే అదికాస్తా 'ఫర్' మని వక్కలైనట్టు ఐలయ్య మాటలు వినడంతోటే గుండె బద్దలైన చిలకవ్వ 'దబ్బు'మంటూ నేలమీద విరుచుకుపడి స్పృహ కోల్పోయింది.

✤ ✤ ✤

''బొయ్ం, బొయ్ం'' మని హారన్లు మోగించుకుంటూ వచ్చిన సుమోలు రెండు తన ముందే ఆగడంతో అప్పటిదాకా ఆలోచనల్లో పడి మెల్లగా నడున్తున్న పొట్టన్న ఒక్కసారిగా వాస్తవంలోకొచ్చి బండ్లు దిగుతున్న వాళ్ళను పరికిస్తూ!! "ఇల్లుగాలి ఒక తేడుస్తుంటే... వొల్లు రేగి వొకడేడ్సినట్టు,'డాం'ల మునిగిపోయి మేమేడుస్తుంటే, ఈల్లేమో మేం పేపరోల్లం, మేం కవులం, మేం కలాకార్లం, వేఁ వేఁతావులం అనుకుంట రోజుకొకరొచ్చి ఏందేందో అడ్గుతరు, ఏందేందో రాస్కుంటరు. ఎవలొచ్చి ఏం రాస్కపోయినా మాకు జరిగే అన్నాలం జర్గుతనే ఉంది. గీ కుశామత్ ముచ్చెట్లతోని అయ్యేదేంలే, పొయ్యేదేంలే'' అనుకోసాగాడు...

"ఏందే తాతా! మేమేదో మందలిచ్చి పోదామనివస్తే, నువ్వేందే ఆలోచనల్లో పడిపోతివేందే?!!" అంటూ వచ్చిన వాళ్ళు పలకరించడంతో "ఏం లేద్దొరా" అంటూ బదులిచ్చాడు. పొట్టన్న తలకు చుట్టుకున్న రుమాలతో మెడల మీది చెమట అద్దుకుంటూ...

"తాతా! ఈ ప్రాజెక్టులో మీ భూములేమన్నా పోయినయా?!"

''ఇండ్లపైసలియ్యలేదని తెల్సింది నిజమేనా?"

"సిరిసిల్ల ఏరియా అంటే ఉద్యమాల గడ్డగదా? మరింత మందికి అన్యాయం జర్గుతుంటే ఎవ్వరూ ముందుకొచ్చి మాట్లాడినట్టు కన్పించట్లేదేంటి?" వచ్చినవాళ్ళంతా ప్రశ్న మీద ప్రశ్న వేస్తూ పొట్టన్నను చుట్టుముట్టారు.

"నేనేం జెప్పాలబాంచన్! అయ్యాల అన్నలకు భయపడి ఇండ్లు, భూములు పడావుబెట్టి పట్నం దెంక పోయిన దొరలంతా ఇయ్యాల ఆఫీసర్లను కట్టుకోని కోట్లు సంపాయిస్తుండ్రు. గిదేందని అడిగినోడులేడు. అయ్యాల ఉద్దమాల్ల ఉరికి నోల్లంత ఇయ్యాల నెత్తురుడిగి ఎత్తుబడ్డరు. గిప్పుడు ఉమ్మరు మీదున్న పోరలకు ఆఁ ఉద్దెమాలు తెల్వకపాయె, ఆఁ త్యాగాలు తెల్వకపాయె. గిదంతా సమజైన సర్కార్ ఇష్టమొచ్చినట్టు సేస్కపోతుంది." తనదైన అవగాహనతో విడమరిచి చెబుతున్న పొట్టన్న గుండెలోతుల్లో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనల లోతెంతో వచ్చిన వాళ్ళకు అర్థమవ్వడంతో వాళ్ళంతా ఆశ్చర్యంతో నోర్లు వెళ్ళబెట్టి చూడసాగారు.

''తమ ఇంటికి నష్టపరిహారం ప్రకటించిన దాంట్లో అన్యాయం జరిగిందని ఈ ఊళ్ళో ఎవరో ఆడమనిషి వళ్ళు గాల్చుకుని చచ్చిపోయిందటగా? ఎవరామె? టి.వి. ఛానల్లో క్రైం రిపోర్టర్ మాదిరిగా ఇంతింత పొడవు మీసాలూ, గడ్డంతో ఉన్న యువకుడొకడు గుడ్ల గూబలా కండ్లు తిప్పుతూప్రశ్నించాడు పొట్టన్నను.

ఆఁ ప్రశ్న వింటూనే...

కాలం మందుతో మానుతున్న గాయాన్ని మొండికత్తి పెట్టికెలికినట్టు బాధపడ్డ పొట్టన్న కళ్ళవెంట దుఃఖం దారలు కడుతుంటే "ఔదొరా! ఎవలో గాదు మా కోడలు పిల్లే" అన్నాడు.

"అయ్యో! మీ కోడలేనా?'' అంటూ ఉద్విగ్నంగా మరికాస్త ముందుకు జరిగి అసలేం జరిగిందో చెప్పమన్నట్టు వాళ్ళంతా పొట్టన్న వంక చూడసాగారు...

✤ ✤ ✤

''అయ్యాలవందులు తోల్కపోయిన పోరనికి బయలుకొచ్చినట్టుంది. కడుక్కుందికి పొక్షైన్ బొందలకు దిగిండు. గాఁ బొందల మనిషి నిల్వేడుకు పైన్నే నిల్లున్నె. కాలు బెస్కినట్టుంది. ఆఁ లీల్లల్లబడి జీతులిడ్సిండు.

పోలీసులొచ్చిరి, తాసీల్దార్ సాబొచ్చి. ఆల్లల్ల ఆల్లు ఏందో గుస, గుస అనుకొన్రి. ఆఖరికి మాతానికొచ్చి "జర్గిందేదో జర్గింది, పోయిన పోరడా తిర్గిరాడు మేం కలెక్టర్ సాబ్‌తో మాట్లాడినం, లచ్చరూపాయలిస్తమని మాటిచ్చిండ్రు, సాబ్ మాటమీద గురుత్త్వ ముంచుకోని జర్గేపని జర్గనియ్యిండ్రి అనుకుంటు మమ్మల్ని బుదరకిచ్చి అన్నే పంచనామాజేసి అజాలేకుంట ఎవని సక్కిన ఆడు దెంకపోయిండు.

మేమంత ఏడ్సి, ఏడ్సి గీఁ మానేరు 'ఢాం'ల నామనవన్ని బొందబెట్టి మట్టితోని సేతులు కడుక్కున్నం.

అటు సెలకపైసలు ఏసుకోని సిన్న కొడుకు, కోడలు, పత్తలేకుంట దెంకపాయిరి. ఇటు ఇంటి పైసలు సక్కంగ లెక్కజెయ్యకపాయిరి, సేసినకాడికన్నా ఇస్తరేమో అంటే ఇయ్యకపాయిరి గున్నసుమంటి పిల్లగాడు బొందపాలాయె. పిల్ల పెండ్లి జెయ్యకపోతిమి. ఇల్లులేకపాయె. ఏ ఊరుబోవాల్నో దారిదోసకపాయె. ఇంత ఆజ్జన కడుపులో బెట్టుకున్న పెద్ద కోడలు గూడు, నీల్లు ఉగ్గబెట్టిఏడ్చి ఏడ్చి ఏన్గులెక్క ఉండే మన్సి పీన్గెలెక్కైపాయె" చెప్పీ, చెప్పీ కొంచెంసేపు గాలి పీల్చుకోవడాని కన్నట్టు ఆగిపోయాడు పొట్టన్న.

కొంతసేపు నిశ్శబ్దం తరువాత ఆ తర్వాతేమైంది? వచ్చిన వాళ్ళంతా అడిగారు.

"ఏముంది దొరా! అయ్యాల నందకాడ ఊల్లెకు తాసీల్దార్ సాబొచ్చిండు ఇండ్ల ముచ్చెట మాట్లాడేదుందట ఊరోల్లంత రాండ్రయ్యో? అనుకుంట టంకా బజాయించి చెప్పిరి. గా ముచ్చెటేందో తెల్సుకుందామని మన్మరాల్ని ఎంటబెట్టుకోని మా ముసల్ది నేను తాసీల్దార్ సాబ్‌తానికి బోయినం.



ఏప్రిల్ 19, 2009న ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నంచే డా॥ అద్దేపల్లి రామమోహనరావుకు సాహిత్య జీవన సాఫల్య ప్రతిభా పురస్కార ప్రధానం జరిగింది. కిరీట ధారి డా॥ అద్దేపల్లికిరువైపులా కొట్టి రామారావు (ఎడమ), సమితి అధ్యక్షులు, జీసనారా, ఇంకా డా॥ ఎం.కె. దుర్గాప్రసాద్, వి.సి. కృష్ణా యూనివర్శిటీ, గుత్తికొండ సుబ్బారావు, సమితి కార్యవర్గం ఉన్నారు.

తీరా ఆడికి బోయేతలికి ఊరోల్లకు, తాసీల్దారు సాబుకు తంద్ర-మంద్ర ఐతాంది.

"కష్టంజేసుకోని బత్కుదామంటె ముప్గిపాయె ఊరని జెప్పి పనికి ఆహారం పతకం గూడ బందుబెట్టిరి. సేసుకుందామంటే రైతుల సేతలన్ని బందైపాయె. ఇంగెట్ల బత్కాల?

"మీ మాటలు నమ్మిగా! ఎంగటాపురం, బోయినంపల్లి దిక్కుబొయ్యి ఒక్కొక్కలం లచ్చ, రొండు లచ్చలు బయానిచ్చి, భూములకు అగ్రిమెంట్లు రాసుకుంటిమి. తీరజూస్తె మీరీడ పైసలియ్యకపోతిరి. పెట్టిన వాయిదకు పైసలు గిట్టక బయానా ఇచ్చిన లచ్చలు ఊకెనే మురిగిపాయె. ఇప్పుడు మేమే గంగల దూకాలా?" అనుకుంట ఊరోల్లు లొల్లిజేస్తుంటే అంత మాత్రం నిలబడి సూస్తున్నం.

వావ్వో! మీ కోడలు గ్యాసు నూనె బోసుకోని అంటుబెట్టుకుందవ్వో? అనుకుంట ఎవలో ఉరికిరానే అచ్చింద్రు.

మా ఎనకనే ఊరంత మా ఇంటి దిక్కు ఉరుకు పుచ్చుకుంది.

ఆస్టల్ల మనుమని సందుగ దీస్కొస్తనని సిరిసిల్లబొయిన కొడుకు ఎప్పుడొచ్చిండో ఏమో. వొంటిమీన ఎగిసి పడుతున్న మంటలకు వోర్సుకోలేక కేకలు బెట్టుకుంట ఇంటిసుట్టు సెంగనాలు దీస్తున్న భార్య చీర బట్టుకోని యాడికాడ నలుపుతుండు.

కొడుకు సేతులు రొండు బొబ్బలెక్కి పోయినైగాని, కోడలి వంటిమీద మంటలు మాత్రం ఆరకపాయె. ఊరంతసూస్తుండంగ మా ఇంటి దీపం ఆరిపాయె.

మా నోట్లో మన్ను గొట్టుకోని ఒక్కదాన్నే ఇంట్లెవొదిలి పెట్టి పోవుడు మా తప్పాయె.

ఈఁ మానేరు డాంల మన్నువడ ఇండ్లమా భూమి బాయె, ఇల్లు బాయె, మనవడు బాయె ఆకరికి కోడలు గూడబాయె". చెబుతున్న పొట్టన్న కళ్ళల్లో జరిగిన ఒక్కో సంఘటన మళ్ళీ సజీవంగా కన్పించాయేమోగాని, అతని వళ్ళంతా దుఃఖంతో రేగుపొదలా కదిలిపోసాగింది.

వచ్చిన వాళ్ళతోపాటు అప్పటిదాకా 'రయ్యు'మని వీస్తున్న బోదగాలి కూడా పొట్టన్న చెప్పిన సంఘటనలకు చలించిపోయినట్టుగా సడీ, సవ్వడీ లేకుండా నిలిచిపోయింది.

ఎవరు ఎన్ని చెప్పినా 'ఎవరి బతుకు వారిదే, ఎవరి కష్టం వారిదే' అన్నట్టు పొట్టన్న నెత్తికి మళ్ళీ ఈతాకుల మోపు ఎత్తిపెట్టిన వాళ్ళంతా మౌన విషాదంగా తమ, తమ వాహనాల్లో కెక్కి నెమ్మదిగా చేతులూపుతూ అక్కణ్ణుండి కదిలిపోయారు.

కెలికిన జ్ఞాపకాలు గాయాలై సలుపుతుంటే నెమ్మదిగా ఇల్లు చేరాడు పొట్టన్న.

❖ ❖ ❖

బిల్లులు ఆగిపోవడంతో ప్రాజెక్ట్ పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రావడంతో "డ్యాం పనులు మళ్ళీ మొదలు పెడుతున్నాం. కాబట్టి, ఊరివాళ్ళంతా రెండు రోజుల్లో ఇండ్లు ఖాళీ చేసి పొవ్వాలొహోఁ" అంటూ ఊరంతా దండోరా వేయించారు.

ఐతే, సర్కార్ వాళ్ళు ఇండ్లకు ఇస్తామన్న నష్టపరిహారం ఇచ్చేదాకా ఇండ్లు ఖాళీ చేసే పనేలేదంటూ ఊరి జనమంతా మొండికేసి కూర్చున్నారు.

ఇట్లా ఐతే లాభం లేదనుకున్న కాంట్రాక్టర్లు పోలీసుల్ని పిలిపించుకుని వాళ్ళ సహాయంతో మరో మాటకు అవకాశం ఇవ్వకుండానే టిప్పర్లతో మట్టిని తెచ్చి పోస్తూ పనులు జోరుగా మొదలుపెట్టారు.

ఊరి వాళ్ళది అరణ్యరోదనే అయ్యింది.

ఆనకట్ట మీదుగా పోసుకొస్తున్న మట్టి మెల్ల, మెల్లగా వచ్చి ఊరి చివరగా ఉన్న పొట్టన్న వాళ్ళ ఇంటిని ముంచెయ్యడం మొదలుపెట్టింది.

కళ్ళ ముందే తమ ఇల్లు మట్టిలో సమాధి అయిపోతుంటే నిస్సహాయంగా రోదిస్తూ పూడుకుపోయిన గొంతుతో "కొడుకా! మనం ఇల్లునేసూసుకుంటాకూకుంటే ఈ కొడుకులు పానాలతోనే మనను కట్టలబొంద బెట్టేటట్లుంద్రు కొడుకా!" అంటూ కొడుకుని పట్టుకుని సోకాలు తియ్యసాగింది రాజవ్వ.

అంతలో...

ఇంటిముందు వేపచెట్టుమీది కాకుల జంట 'కావ్, కావ్' మంటూ అరుస్తుండడంతో ఏడుస్తున్న రాజవ్వతో పాటు ఇంటిల్లాజులూ చెట్టుమీది కాకుల వంక చూశారు.

కాకులు రెండూ గూడును వదిలి పెట్టి ఎక్కడికో ఎగిరిపోతున్నట్టుగా అర్థమౌతుంది.

పొట్టన్న కుటుంబానికి ఓ దారి దొరికింది.

అందరికంటే ముందు పందుల గుంపు, వాటి వెనుక పొట్టన్న వెనుక రాజవ్వ, రాజవ్వ వెనుక పూలవ్వ, పూలవ్వ వెనుక కాలిన చేతులతో నల్లన్న.

తలల మీద మూటా, ముల్లెలతో ఇల్లు విడిచిన పొట్టన్న కుటుంబం అట్లా ఎంత దూరం వెళ్ళాలో? ఎక్కడికి వెళ్ళాలో? తెలియక ముందుకు పోతూనే ఉంది...

ఆనకట్ట, ఊరును మింగెయ్యడానికి కొండచిలువలా వస్తూనే ఉంది...


స్వగృహ ఫుడ్స్

Swagruha® Foods

Opp : P.W.D. Grounds, M.G. Road, VIJAYAWADA - 10

Phone : 2475763, Fax : 0866 - 2480200.

Eluru Road (Canara Bank Building).

Near Vijaya Talkies, Vijayawada - 520 002. Ph : 6626263.

10/2, Arundelpet, Guntur - 522 002. Ph : 2235350.

Visit us : www.swagruhafoods.net